క్లుప్తంగా

విద్యార్థుల బస్‌పాస్‌లకు రూ.3 లక్షల విరాళం



జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్‌కు విరాళం అందజేస్తున్న ఫ్యాక్టరీ ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం: విద్యార్థులకు ఇచ్చే ఉచిత బస్‌పాస్‌ల నిమిత్తం నవ భారత్ పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.3లక్షలు విరాళం అందజేసింది. ఆర్టీసీ డిపో మేనేజర్ పీపీపీ గంగాధర్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల బస్‌పాస్‌ల కోసం ఈ విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. రూ.3లక్షలతో పేద విద్యార్థులకు 2023–24 సంవత్సరానికి గానూ ఉచిత బస్‌పాస్‌లు మంజూరు చేస్తామని ఆయన చెప్పారు.

నిలకడగా కురుస్తున్న వర్షాలు



కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో ప్రవహిస్తున్న పడమటి కాలువ

కొయ్యలగూడెం: అల్పపీడన ద్రోణి ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. శుక్రవారం ఉదయం కన్నాపురం బుట్టాయగూడెం రోడ్డులోని పడమటి కాలువ పొంగి ప్రవహించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజవరం వద్ద ఎర్ర కాలువకు పులివాగు, బైనేరువాగులు తోడు కావడంతో ఉధృతంగా ప్రవహించింది. గిరిజన గ్రామాల్లోని పిల్ల కాలువల ప్రభావం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

విద్యార్థినులకు నగదు పురస్కారాలు



పరింపూడిలో విద్యార్థినులకు నగదు పురస్కారాలు అందజేస్తున్న దాతలు

కొయ్యలగూడెం: పరింపూడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థినులకు నగదు పురస్కారాలను హెచ్‌ఎం ఉమాదేవి ఆధ్వర్యాన అందజేశారు. కీర్తిశేషులు గిరి మహంతి సీతా మహాలక్ష్మి (రిటైర్డ్ టీచర్) జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ప్రథమ ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.5వేలు చెక్కు, జ్ఞాపికను బహూకరించారు. తెలుగు సబ్జెక్టులో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థినులకు కూడా రూ.1,000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. పీసీ చైర్మన్ ఆర్.సంధ్యారాణి, హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

నగదు బహుమతులు

పోలవరం రూరల్: మండలంలోని గూటాల జెడ్పీ హైస్కూల్‌లో ఎస్సీ, ఎస్టీ బాలికలను ప్రోత్సహిస్తూ ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు కెనరా బ్యాంకు సహకారంతో నగదు బహుమతులు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు ఏవీ రాఘవన్ తెలిపారు. కెనరా బ్యాంకు విద్యాజ్యోతి పథకంలో భాగంగా విద్యార్థులకు ఈ ప్రోత్సాహకాన్ని అందించినట్లు తెలిపారు. 6, 7 తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,500, 8,9,10 తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున కెనరా బ్యాంకు గూటాల బ్రాంచ్ మేనేజర్ పి.పవన్‌కుమార్ శుక్రవారం అందజేసినట్లు చెప్పారు. అలాగే పాత పట్టిసీమ ప్రత్యేక పాఠశాలలో చదువుతున్న 5వ తరగతి విద్యార్థికి రూ.2,500 అందజేశారు.

జీవ నియంత్రణ ఎరువుల తయారీపై శిక్షణ



చింతలపూడి మండలం మల్లాయగూడెంలో శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

చింతలపూడి: జీవ నియంత్రణ ఎరువుల (బయో కల్చర్) విధానం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి ఎల్.జయరాజు తెలిపారు. మండలంలోని మల్లాయగూడెంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శుక్రవారం జీవ నియంత్రణ ఎరువులపై శిక్షణ ఇచ్చారు. జీవ నియంత్రణ ఎరువుల (బయో కల్చర్) ప్రయోజనాలను రైతులు వివరించాలని సూచించారు. బయో కల్చర్ తయారీ విధానం, వాటి పనితీరు, ఉపయోగాలను తెలిపారు. బయో కల్చర్‌ను తయారు చేశాక మొక్కజొన్న, వరి రైతులకు ఉచితంగా అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మూడు మండలాల ప్రకృతి వ్యవసాయ క్షేత్ర స్థాయి సిబ్బంది, గుత్తి శ్రీనివాస వర్మ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో వ్యయం ఆదా

- రసాయన ఎరువుల వినియోగంతో పెరుగుతున్న సాగు ఖర్చులు
- మెట్ట ప్రాంతంలో రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు



సేంద్రియ ఎరువు కోసం పచ్చిరొట్ట సాగు చేస్తున్న దృశ్యం

చింతలపూడి: రైతులు రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వాడి సాగు ఖర్చులను ఆదా చేసుకోవాలని చింతలపూడి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు బి.నాగకుమార్ సూచిస్తున్నారు. ప్రస్తుత తరుణంలో రైతులు రసాయన ఎరువులు అధికంగా ఉపయోగించడం వల్ల సాగు ఖర్చులు పెరిగి నష్టాల్లో కూరుకుపోతున్నారని, సేంద్రియ సాగుతో వ్యయం తగ్గి లాభాలు చేకూరుతాయని తెలిపారు.

సేంద్రియ ఎరువులు అంటే..

సేంద్రియ ఎరువుల్లో పశువుల ఎరువు, వానపాముల ఎరువు, గొర్రెలు, కోళ్ళ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు ముఖ్యమైనవి. వీటి వాడకం వల్ల భూమి తన సహజ స్థితిని పొందటమే కాక, పంటకు ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాలు లభిస్తాయి. అంతేకాక నాణ్యమైన, విష రహితమైన పంటలను పండించవచ్చు. వీటితో పాటు వేరుశనగ, వేప, పొద్దు తిరుగుడు, ఆముదం చెక్కలను కూడా వాడవచ్చు. వీటి వల్ల మొక్కలకు పోషక పదార్థాలు ఎక్కువగా లభిస్తాయి.

పచ్చిరొట్ట ఎరువులు

సమగ్ర పోషక యాజమాన్యంలో పచ్చిరొట్ట ఎరువులు ప్రధానమైనవి. పచ్చిరొట్టతో వివిధ పంటల్లో దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. పచ్చిరొట్టలో జీలుగ, జనుము, పిల్లి పెసర, అలసంద, పెసర, మినుము ముఖ్యమైనవి.

జీవ ఎరువులు

పంటల పెరుగుదలకు కావాల్సిన పోషకాలను అందించే సూక్ష్మ జీవకణాల సముదాయాలను జీవన ఎరువులు అంటారు. వీటిలో నత్రజనిని స్థిరీకరించేవి రైజోబియం, నీలి ఆకుపచ్చ ఆకు, అజిటో బ్యాక్టీరియా, అజో స్పైరిల్లం, అజొల్లా ఒక రకం కాగా, జీవన ఎరువు భాస్వరంను భూమిలో లభ్యమయ్యేలా చేసే ఫాస్ఫో బ్యాక్టీరియా రెండోది. ఇవి మార్కెట్లో వివిధ పరిమాణాల్లో లభిస్తాయి.

నీలి ఆకుపచ్చ నాచు

ఎకరాకు 4 కిలోల నాచు పొడిని ఇసుకతో కలిపి మడి అంతా సమానంగా పడేటట్లు వేయాలి. 7–10 రోజుల మధ్య మడిలో నీరు పెట్టాలి. నాచు గాలిలోని నత్రజనిని తీసుకుని స్థిరీకరిస్తుంది. దీని వలన ఎకరాకు 8–12 కిలోల నత్రజని పంటకు అందుతుంది. దీంతో దిగుబడి కూడా పెరుగుతుంది.

అజిటో బ్యాక్టర్

ఒక ఎకరానికి సరిపడే విత్తనానికి 200–400 గ్రాముల కల్చరును పట్టించాలి. లేదా 1కిలో కల్చరును 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరం నేలపై చల్లాలి. వరి, చెరకు, జొన్న, పత్తి, సజ్జ, మిరప పంటల్లో వేసుకుంటే మంచిది. దీని వల్ల ఎకరానికి 8–16 కిలోల నత్రజని పైరుకు అందుతుంది.

అజొల్లా

దమ్ములో ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను వేసి పలుచగా నీరు పెట్టి 100–150 కిలోల అజొల్లా వేసి 2–3 వారాల తరువాత నేలలో కలియ దున్నేయాలి. ఎకరానికి 3 టన్నుల పచ్చిరొట్టతో 12 కిలోల నత్రజని అందుతుంది.

భాస్వరపు జీవన ఎరువు

ఫాస్ఫో బ్యాక్టీరియా భూమిలో లభ్యంకాని స్థితిలోని భాస్వరాన్ని లభ్యమయ్యేలా చేస్తుంది. ఎకరాకు సరిపడే విత్తనంలో 200–400 గ్రాముల కల్చర్‌ను పట్టించాలి. లేదా ఒక కిలో కల్చరును 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరం నేలలో వేయాలి. ఇక రైతులు రసాయనిక ఎరువులను సిఫార్సు మేరకే వాడాలని, అధిక మోతాదులో వాడితే తెగుళ్ళు ఎక్కువవుతాయని నాగకుమార్ తెలిపారు.



బి.నాగకుమార్, సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు, చింతలపూడి

పేదల జీవితాల్లో వెలుగులు సీఎం జగన్ లక్ష్యం

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- బుట్టాయగూడెం మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం



లంకాలపల్లిలో మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



లక్కవరంలో ఎమ్మెల్యే ఎలీజాకు హారతి ఇస్తున్న మహిళ

బుట్టాయగూడెం: పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. శుక్రవారం బుట్టాయగూడెం మండలం సీతప్పగూడెం సచివాలయ పరిధిలో గల లంకాలపల్లి, రాచూరు, కుమ్మరికుంట, కాపవరం గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే పథకాలు పొందిన లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే బలరాజు మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రతి గడపకూ వెళ్తున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలిపారు. సీఎం జగన్ పాలనలో మారుమూల అటవీ ప్రాంతంలోని గ్రామాల గిరిజనులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని చెప్పారు. ప్రతి గ్రామంలోని ప్రజలకు రూ.2 లక్షలు నుంచి రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్‌లు సరియం లక్ష్మి, తెల్లం వెంకాయమ్మ, మడకం రామలక్ష్మి, పొడియం లక్ష్మి, జోడే సత్య దుర్గాప్రసాద్, బన్నే బుచ్చిరాజు, ఉయికే బొజ్జి, ఎంపీటీసీ సభ్యులు మొడియం వెంకమ్మ, గాలి దుర్గారావు, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, తెల్లం చిన్నారావు, సరియం చల్లయ్య, తెల్లం దేవరాజు, కణితి దుర్గారావు, దినేష్, ఎంపీడీవో ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఎస్.శారా శాంతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే

జంగారెడ్డిగూడెం రూరల్: టీడీపీ హయాంలో జరిగిన స్వార్థపూరిత పాలనను, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న సంక్షేమ పరిపాలనను ప్రజలు గమనించారని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని లక్కవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తూ పారదర్శక పాలన కొనసాగుతుండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన నవరత్నాల హామీల్లో భాగంగా అర్హత గల వారందరికీ ఆసరా, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, వాహన మిత్ర, రైతు భరోసా, వంటి అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తూ ప్రజలకు మరింత చేరువవుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జి, సర్పంచ్ గెల్లా వెంకట రమణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, సొసైటీ చైర్మన్ బడి దుర్గారావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాథ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారధి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ సేవలు దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



సీతప్పగూడెంలో సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: గ్రామ సచివాలయ సేవలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని కాపవరం సమీపంలో నూతనంగా నిర్మించిన సీతప్పగూడెం సచివాలయ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాలన ప్రజలందరికీ చేరువ కావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని చెప్పారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అన్ని రకాల సేవలను సచివాలయాల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, ఎంపీడీవో ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఎస్.శారా శాంతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి అగ్నిమాపక కేంద్రం తనిఖీ

చింతలపూడి: చింతలపూడి అగ్నిమాపక కేంద్రాన్ని ఏలూరు జిల్లా అగ్నిమాపక అధికారి రత్నబాబు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫైర్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అగ్నిమాపక వాహనాన్ని పరిశీలించి, ఫైర్‌స్టేషన్ ద్వారా అందిస్తున్న సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. రత్నబాబు మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా చింతలపూడి అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించినట్లు చెప్పారు. మండలంలో ఉన్న 3 పరిశ్రమలను వార్షిక తనిఖీ చేస్తామన్నారు. కాగా చింతలపూడి ఫైర్‌స్టేషన్‌కు కొత్త వాహనాన్ని డీజీపీ పీవీ సునీల్ మంజూరు చేశారని, ఈ వాహనం త్వరలో అగ్నిమాపక కేంద్రానికి చేరుకుంటుందని ఆయన వివరించారు.

మోటార్ సైకిల్ చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మోటార్ సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేగవరం బీసీ కాలనీకి చెందిన పల్లి రామారావు గత నెల 30వ తేదీ ఉదయం తన మోటార్ సైకిల్‌ను ఇంటి ముందు రోడ్డుపై పార్కు చేసి లోపలికి వెళ్లాడు. మధ్యాహ్నం బయటకు వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చి చూడగా, మోటార్ సైకిల్ కనిపించలేదు. ఎంత వెతికినా ప్రయోజనం లేక శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

30న ఐటీడీఏ పాలక వర్గ సమావేశం

బుట్టాయగూడెం: ఈనెల 30వ తేదీన ఐటీడీఏ పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేసినట్లు పీవో ఎం.సూర్యతేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు ఖచ్చితమైన సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నట్లు పీవో పేర్కొన్నారు.

చేగొండిపల్లిలో వార్డు సభ్యుని ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి



ద్వారకాతిరుమలలో పోలింగ్ బూత్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో ఝాన్సీరాణి

పోలవరం రూరల్: పోలవరం మండలం చేగొండిపల్లి పంచాయతీలో వార్డు మెంబర్ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో జి.శ్రీను తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటింగ్ ప్రక్రియ, తదుపరి కౌంటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ వార్డులో 106 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ పోలింగ్ స్టేషన్ వద్ద బందోబస్తు నిర్వహిస్తారని తెలిపారు.

ద్వారకాతిరుమలలో..

ద్వారకాతిరుమల: పంచాయతీ వార్డు సభ్యుల ఉప ఎన్నికకు సర్వం సిద్ధమైంది. ఈ క్రమంలో ద్వారకాతిరుమలలోని పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలను జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఝాన్సీరాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో రజాఉల్లా, సీఐ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఏవీ సుబ్బరాయన్, పంచాయతీ కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావులకు ఆమె పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇదిలా ఉంటే ద్వారకాతిరుమలలోని 8వ వార్డు, గుణ్ణంపల్లిలోని 6వ వార్డుకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా వార్డుల్లో సందడి నెలకొంది. అభ్యర్థుల తరఫున వారి మద్దతుదారులు ప్రచారాన్ని జోరుగా నిర్వహించారు. గెలుపు ఎవరిదనేది శనివారం సాయంత్రానికి తేలనుంది.

శ్రావణ శోభ.. ఆలయాలు కిటకిట



విశేషాలంకరణలో ముత్యాలమ్మ



ద్వారకాతిరుమలలో కుంకుళ్లమ్మకు హారతులిస్తున్న అర్చకుడు

కొయ్యలగూడెం: శ్రావణ మాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని మహిళా భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. కొయ్యలగూడెంలోని శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. మదన గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో మార్వాడి మహిళలు సామూహిక దేవి పారాయణం చేశారు. అధిక శ్రావణ మాసం, అదేవిధంగా నిజ శ్రావణమాసం కలిపి రెండు మాసాల్లో మార్వాడి మహిళలు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాలక మండలి మార్వాడి మహిళలకు ప్రత్యేక వసతులు కల్పించింది. బయ్యనగూడెం, గవరవరం, రాజవరం, కన్నాపురం గ్రామాల్లోని కనక దుర్గమ్మ, గ్రామ దేవతల ఆలయాలు భక్తులతో పోటెత్తాయి.

లక్ష పసుపు కొమ్ములతో నూకాలమ్మకు అలంకరణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నూకాలమ్మ అమ్మవారు లక్ష పసుపు కొమ్ముల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా ఐదు శుక్రవారాలు అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో పూజించనున్నట్లు తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి, సూర్యనారాయణ దంపతులు, పట్టణ ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

కుక్కునూరులో..

కుక్కునూరు: శ్రావణ మాసం తొలి శుక్రవారం మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కుక్కునూరు శ్రీ కాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, పెద్దరావిగూడెం కేదారేశ్వర స్వామి, రాజీవ్‌నగర్ శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాల్లో పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. కుక్కునూరు శివాలయంలోని అమ్మవారి విగ్రహాన్ని చామంతి, బంతి, గులాబీ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

జంగారెడ్డిగూడెం వాసవి ఆలయంలో..

జంగారెడ్డిగూడెం: స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని గాజులతో అలంకరించారు. 100 మంది ఆర్యవైశ్య మహిళలు సారె సమర్పించారు. లలితా సహస్ర నామ పారాయణ చేశారు. భక్తులకు శ్రీనివాస షాపింగ్ మాల్ యాజమాన్యం అన్నప్రసాదం వితరణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు తడికమళ్ల తారకం, మహంకాళి రాంబాబు, కర్పూరం జనార్దన్,, దూబగుంట్ల బాపిరాజు, నాగసూరి వసంత్ తదితరులు పాల్గొన్నారు.

విశేషాలంకరణలో ముత్యాలమ్మ

జంగారెడ్డిగూడెం పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మ కుమారి దంపతుల పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు మిర్తిపాటి విశ్వనాథ శ్రీనివాస శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో యర్రా నాగేశ్వరరావు దంపతులు, మహంకాళి గుప్తా, కొట్టగుండు కుమార్ దంపతులు, చొడవరపు రంగారావు దంపతులు, గుడిమెట్ల భాస్కరరావు దంపతులు, నౌడు ఆనంద్ పాల్గొన్నారు.

క్షేత్ర దేవతకు విశేష పూజలు

ద్వారకాతిరుమల: శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తొలుత అర్చకులు అమ్మవారికి విశేష పుష్పాలంకారాలు చేశారు. తర్వాత కుంకుళ్లమ్మకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ యాగశాలలో అర్చకులు, పండితులు హోమాది కార్యక్రమాలను జరిపారు. భారీగా మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు నివాళి

కొయ్యలగూడెం: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని శుక్రవారం బయ్యనగూడెంలో మండల గౌడ సంఘం ఆధ్వర్యాన నిర్వహించారు. రాష్ట్ర గౌడ సంఘం నాయకుడు చనుమోలు అశోక్ గౌడ్ హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ పోరాట వీరులకు పాపన్న గౌడ్ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు తదితరులు పాల్గొన్నారు. టీటీడీ పాలక మండలి సభ్యునిగా మేకా శేషబాబును నియమించడం పట్ల జిల్లా గౌడ్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చిటికెన శ్రీనివాస్, రాష్ట్ర గౌడ్ సంఘ సెక్రటరీ కాసగాని గోఖలే తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు సచివాలయ కన్వీనర్ల సమావేశం

కొయ్యలగూడెం: పోలవరం నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ల సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు సచివాలయాల మండల కో ఆర్డినేటర్ నూకల రాము తెలిపారు. గణేష్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు జరిగే సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏడు మండలాల పరిధిలోని 350 సచివాలయాల కన్వీనర్లు, పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.